క్లుప్తంగా

రాజిరెడ్డికి సన్మానం



పరకాల : వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియామకమైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చందుపట్ల రాజిరెడ్డిని హనుమకొండ నగరంలో పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత దంపతులు సన్మానించి అభినందించారు. నాయకులు సుమన్, యాకుబ్ అలీ, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో జేసీబీ దగ్ధం



వేలేరు : షార్ట్ సర్క్యూట్‌తో జేసీబీ దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని పీచర గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బాధితులు మంతపురి అశోక్, శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. రోజుమాదిరిగానే జేసీబీ వాహనాన్ని శుక్రవారం సాయంత్రం ఓ పౌల్ట్రీ ఫామ్ వద్ద పార్కింగ్ చేసి ఇంటికి వెళ్లామని తెలిపారు. శనివారం ఉదయం వెళ్లి చూసేవరకు వాహనం కాలిపోయి ఉందని బాధితుడు తెలిపారు. సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన యాదగిరి

ఐనవోలు : టీపీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను మండలంలోని నందనం గ్రామానికి చెందిన ఏఐసీసీ నేషనల్ జాయింట్ కో ఆర్డినేటర్ ఉల్లెంగుల యాదగిరి హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడిని శాలువాతో సన్మానించారు.

వృద్ధురాలి అదృశ్యం



పరకాల : కమలాపూర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన వృద్ధురాలు పుల్ల రాజేలమ్మ తప్పిపోయింది. ఈ మేరకు ఆమె కుటుంబ సభ్యులు పరకాల పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పరకాల పట్టణంలోని తన సోదరి ఇంటికి వచ్చిన రాజేలమ్మ.. గురువారం తిరుగు ప్రయాణంలో ఇంటికి చేరుకోలేదు. దీంతో ఫిర్యాదు చేసినట్లు పరకాల పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు పరకాల పోలీసులకు 8712685224(సీఐ పరకాల) లేదా వారి కుటుంబ సభ్యులు 939152772 , 7893415372 నంబర్‌లకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

కేజీబీవీ ఎస్‌ఓకు నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు

సంగెం : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ ప్రత్యేకాధికారి కండె నీలిమ నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి విశ్వం స్కూల్‌లో యువతేజం ట్రస్ట్, కలాం విజన్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, టీచర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు ఆచార్య దేవోభవ పురస్కారం, నేషనల్ ఎక్స్‌లెన్సీ అవార్డు అందజేశారు. అందుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు డాక్టర్ సుబ్రహ్మణ్యంశర్మ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నట్లు తెలిపారు

ప్రజాపాలనలో సమన్యాయం

నర్సంపేట : ప్రజాపాలనలో ప్రజలకు సమన్యాయం జరుగుతుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు నెక్కొండ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, రెడ్లవాడ సొసైటీ వైస్ చైర్మన్ రోజనాల సంపత్ కుమార్ శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నర్సంపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరెడ్డి.. సంపత్‌కుమార్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, సీనియర్ నాయకులు చెన్న కేశవులు, మార్కెట్ డైరెక్టర్ మైపాల్‌రెడ్డి, వెంకటా పురం గ్రామ కమిటీ అధ్యక్షుడు వంగాల బాబు, నాయకులు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వాగ్వాదం

వర్ధన్నపేట: వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయం సమావేశపు హాలులో కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఎజెండా ప్రకారం గణపతి నిమజ్జన ఏర్పాట్లు, దసరా ఉత్సవాల ఏర్పాట్లపై కౌన్సిలర్లతో సమావేశంలో చర్చించారు. కాగా, అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల నడుమ తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుని పరిస్థితి ఉద్రిక్తంగా మారినట్లు సమాచారం.

మార్మోగిన గణపతి నామస్మరణ

- మండపాల వద్ద అన్నదానాలు
- భక్తిశ్రద్ధలతో పూజలు చేసిన భక్తులు
- 8వ రోజున కొనసాగిన ఉత్సవాలు



కమలాపూర్ : దీపారాధన చేస్తున్న భక్తులు



కమలాపూర్ : పూజలు చేస్తున్న సీఐ హరికృష్ణ



దామెర : నోట్ బుక్స్ అందజేస్తున్న అనిల్‌రెడ్డి దంపతులు



శాయంపేటలో..

కమలాపూర్ : గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా మండలంలో గణపతి నామస్మరణతో వీధులు మార్మోగాయి. మండల కేంద్రంలోని శ్రీవిశ్వసాయి భక్త భజన మండలి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి దీపారాధనను ఘనంగా నిర్వహించారు. మహిళలు వినాయక మండపంలో దీపాలు వెలిగించి దీపారాధన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. అదే విధంగా శ్రీగణేశ్ భక్త భజన మండలి ఆధ్వర్యంలో దాతలు తోకల చైతన్య-కనకరాజు దంపతులు, గణేశ్వర భక్త భజన మండలి ఆధ్వర్యంలో దాతలు పోతునూరి రమాదేవి-రాజశేఖర్, లక్ష్మీ గణపతి భక్త భజన మండలి ఆధ్వర్యంలో బండి సరిత-రవీందర్ దంపతులు భక్తులకు మహా అన్నప్రసాద వితరణ చేయగా స్థానిక సీఐ హరికృష్ణ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించి నిర్వాహకులతో కలిసి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. లలిత, విజయ, వైష్ణవి, సంగీత, సుమలత, లత, రమాదేవి, కల్యాణి, నర్సింహారెడ్డి, శ్రీధర్, నరేందర్‌రెడ్డి, బక్కిరెడ్డి, మల్లారెడ్డి, నాగరాజు, కుమారస్వామి, శ్రీకాంత్, సుభాశ్, సతీష్, నాగరాజు, శ్రీకాంత్, ఐలయ్య, రాజ్‌కుమార్, రాజు, శ్యాంసుందర్‌రెడ్డి, రాజశేఖర్, శ్రీను, పవన్, కోటి, భిక్షపతి, వినోద్, వెంకటేష్, సతీష్, భక్తులు పాల్గొన్నారు.

శాయంపేట : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ కాలనిలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద గ్రామానికి చెందిన బాసాని పద్మజయప్రకాశ్ దంపతుల ఆధ్వర్యంలో, ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన మండపం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రమోద్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఉత్సవ కమిటీ సభ్యులు రవీందర్, వేణు, రమేశ్, భాస్కర్, సంతోష్, సుమన్, భక్తులు పాల్గొన్నారు.

పరకాల : పట్టణంలోని శక్తి స్థల్ వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో అన్నదాన కార్యక్రమాన్ని సీఐ క్రాంతికుమార్, ఎస్‌ఐ రమేశ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి శనివారం ప్రారంభించారు. అనంతరం బీజేపీ, ఏబీవీపీ నాయకులు సీఐని శాలువాతో సన్మానించారు. బీజేపీ నాయకులు విజేందర్‌రావు, రాజభద్రయ్య, భాస్కరచారి, రంజిత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దామేశ్వరాలయంలో సరస్వతి పూజ

దామెర : మండల కేంద్రంలోని శివాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం సరస్వతి పూజ నిర్వహించారు. గ్రామానికి చెందిన మాజీ పీపీ పోల్సాని అనిల్‌రెడ్డి-లక్ష్మి దంపతులు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు నాగిళ్ల రాజుశర్మ వేద మంత్రోచ్చరణ నడుమ పూజ కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు కుంకుమ పూజ నిర్వహించగా పెద్దెత్తున మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. అదే విధంగా శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో ఉట్టికొట్టి రంగోళి పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. నిర్వాహకులు మోహన్, రవికుమార్, భిక్షపతి, తాతరాజు, తాత తిరుపతి, రవికుమార్, కుమార్ మహిళలు, యువకులు పాల్గొన్నారు. అలాగే ఊరుగొండలో శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సునీల్ రెడ్డి, రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ నారాయణ, ఏసీపీ కిశోర్‌కుమార్

ఆత్మకూరు : గణపతి నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ నారాయణ అధికారులకు సూచించారు. మండలంలోని కటాక్షపూర్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను సోమవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. క్రేన్, సౌండ్ సిస్టమ్, టెంట్ తదితర ఏర్పాట్లపై ఆరా తీశారు. ఏసీపీ కిశోర్‌కుమార్, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సంతోష్ తదితరులు ఉన్నారు.

సభ్యత్వ నమోదు

గీసుకొండ : మండలంలోని ధర్మారం, గీసుకొండ జెడ్పీ హైస్కూళ్లలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులు సంఘంలో చేరి మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు పర్వతి సత్యనారాయణ, సంగీత, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..

- ప్రమాదకరంగా కల్వర్టులు
- రక్షణ గోడలు లేకపోవడంతో ప్రయాణికుల భయాందోళన
- శిథిలావస్థలో పలు కల్వర్టులు



మల్లికుదుర్ల కుమ్మరిగూడెం గ్రామాల మధ్య ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు



కన్నారం ఊరి చివరన రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

వేలేరు : మండలంలోని పలు గ్రామాలలకు వెళ్లే రహదారులపై నిర్మించిన కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. రక్షణ గోడలు(రెయిలింగ్) లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లోని కల్వర్టులపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం తప్పదని, రాత్రివేళల్లో కల్వర్టులపై నుంచి ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందేనని వాహనదారులు వాపోతున్నారు. అయితే మల్లికుదుర్ల నుంచి కుమ్మరిగూడెం వెళ్లే దారిలో ఉన్న కల్వర్టు కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించింది. ప్రస్తుతం కల్వర్టు పెచ్చులూడిపోయి శిథిలావస్థకు చేరుకుంది. ఆ దారి గుండా నిత్యం పాఠశాల బస్సులు, వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, సింగిల్ రోడ్డు కావడం, కల్వర్టుకు రక్షణ గోడలు లేకపోవడంతో వాహనం అదుపుతప్పితే నేరుగా వాగులో పడే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. అలాగే పీచర నుంచి మల్కాపూర్ వెళ్లే దారిలో మంచినీళ్ల వాగు వద్ద కూడా కల్వర్టుకు రక్షణగోడలు లేక ప్రమాదకరంగా కనిపిస్తోంది. గతంలో మంచినీళ్ల వాగులో పలు వాహనాలు అదుపుతప్పి కల్వర్టులో పడిన ఘటనలూ ఉన్నాయి. కన్నారం గ్రామం చివరన నూతన గ్రామపంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న కల్వర్టు, వేలేరు నుంచి హనుమకొండకు వెళ్లే దారిలో, కమ్మరిపేటకు వెళ్లే దారిలో ఉన్న కల్వర్టులు కూడా ప్రమాదకరంగా ఉన్నాయని ప్రయాణికులు అంటున్నారు. ఇప్పటికైనా కల్వర్టులపై రక్షణ గోడలు నిర్మించాలని, శిథిలావస్థకు చేరుకున్న కల్వర్టుల స్థానంలో కొత్తవి నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కొత్త కల్వర్టు నిర్మించాలి



మండలంలోని మల్లికుదుర్ల నుంచి కుమ్మరిగూడెంకు వెళ్లే దారిలో కల్వర్టు కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించింది. ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరుకుంది. కల్వర్టుకు రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఆయా కల్వర్టులపై రాత్రిపూట ప్రయాణించాలంటే భయం వేస్తుంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి కొత్త కల్వర్టును నిర్మించాలి.

- యాకుబ్, మల్లికుదుర్ల గ్రామస్తుడు

బీజేపీ పాలనలోనే దేశాభివృద్ధి



నర్సంపేట : మాట్లాడుతున్న పాపారావు

నర్సంపేట : బీజేపీ పాలనలోనే దేశ అభివృద్ధి జరుగుతోందని ఆ పార్టీ జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ పాపారావు తెలిపారు. పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన నియోజకవర్గ సభ్యత్వ నమోదు సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే రెండు నెలలు కార్యకర్తలు సమష్టిగా శ్రమించి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. కిందిస్థాయిలో ప్రజాప్రతినిధులను గెలిపిస్తేనే పార్టీ బలం పెరుగుతుందని చెప్పారు.

ధర్మారంలో..

గీసుకొండ : మండలంలోని ధర్మారంలో గల పార్టీ జిల్లా కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై ఓబీసీ, బీసీ, మహిళ, ఎస్సీ, యువ, ఎస్టీ, కిసాన్ మోర్చాల అధ్యక్షులు, నాయకులతో శనివారం నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ మాట్లాడారు. సభ్యత్వ నమోదుకు అనుబంధ మోర్చాల ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. సమావేశాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, కుసుమ సతీష్, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్, వన్నాల శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి, నర్సంపేట కాంటెస్ట్ అభ్యర్థి పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూతోనే హక్కుల సాధన

పర్వతగిరి : పీఆర్‌టీయూతోనే ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించగలమని జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫార్ తెలిపారు. భూక్య రాములు అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల శాఖ సర్వసభ్య సమావేశానికి రవీందర్‌రెడ్డి, గఫార్ హాజరై మాట్లాడారు. బీఈడీ కలిగిన ఎస్‌జీటీలకు ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రమోషన్లు, హెల్త్‌కార్డులు ఇప్పిస్తామన్నారు. మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయుల బదిలీ కోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. రెండు డీఏలు ఇప్పించే బాధ్యత యూనియన్ తీసుకుంటుందని తెలిపారు. అనంతరం యూని యన్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాములు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



శ్రీధర్ రెడ్డిని పరామర్శిస్తున్న చల్లా ధర్మారెడ్డి

దామెర : మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం పరామర్శించారు. ఒగ్లాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి, సీనియర్ పాత్రికేయుడు మన్నెం ఇంద్రారెడ్డి, ఊరుగొండ మాజీ సర్పంచ్ మల్లాడి రాజిరెడ్డి కోడలు సింధూ ఇటీవల అనారోగ్యం బారిన పడగా ధర్మారెడ్డి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని మనోధైర్యం కల్పించారు. ఆదుపలో ఉన్న వారిని ఆదుకునేందుకు వెనుకడుగు వేయనని, అండగా ఉంటానని ఈ సందర్భంగా ఆయన భరోసా కల్పించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, మాజీ వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, జిల్లా నాయకులు కాంతాల కేశవరెడ్డి, పుల్యాల రఘుపతిరెడ్డి, రాజేశ్వర్‌రావు, కిన్నెర రమేశ్ ఉన్నారు.

పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



రక్తపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మంజుల

దామెర : పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల వైద్యాధికారి మంజుల అన్నారు. పోషణమాసం సందర్భంగా మండల కేంద్రంలో పిల్లలకు శనివారం శాంబామ్ (ఆకలి పరీక్ష), రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రక్తహీనతతో ఉన్నట్లు గుర్తించి నివారణకు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. పిల్లలు వయస్సుకు తగిన బరువు ఉండే విధంగా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలన్నారు. రక్తహీనత కలిగిన పిల్లలకు ఐరన్, పోషక పదార్థాలు అధికంగా ఇవ్వాలని సూచించారు. అనారోగ్యం బారిన పడితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. ఐసీడీఎస్ సిబ్బంది సదిరం కోమల, బిల్లా వనజ, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం ఉమాదేవి, పిల్లలు, తల్లిదండ్రులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకోవాలి



ఎంజేపీ పాఠశాలలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దామెర : క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఒగ్లాపూర్ మహాత్మా జ్యోతిభాపూలే పాఠశాల ప్రిన్సిపాల్ యాదగిరి అన్నారు. భూపాలపల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాఠశాలకు చెందిన అఖిల్, విద్యాకర్, భరత్, మహేందర్, అరవింద్ బంగారు, రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం సమావేశం ఏర్పాటు చేసి వారిని అభినందించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో పీఈటీలు శ్రీకాంత్, శ్రీనాథ్, ఉపాధ్యాయులు అశోక్, రేణుక, సృజన, శ్వేత, కిశోర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మిలాద్‌ఉన్‌నబీని ప్రశాంతంగా జరుపుకోవాలి



దర్గాను పరిశీలిస్తున్న ఏసీపీ కిశోర్‌కుమార్

దామెర : రానున్న మిలాద్‌ఉన్‌నబీ పండుగను ముస్లింలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఏసీపీ కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల సైలాని బాబా దర్గాను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి మహ్మద్ అబ్దుల్ హమీద్ (సైలాని బాబా) ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఏసీపీ దర్గా పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. మిలాద్‌ఉన్‌నబీ పండుగను ముస్లిం భక్తిశ్రద్ధలతో ప్రశాతంగా జరపుకోవాలని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. దర్గాకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు దర్గా పీఠాధిపతి పేర్కొన్నారు. ఏసీపీ వెంట సీఐ రంజిత్‌రావు, ఎస్కే మోయినుద్దీన్ ఉన్నారు.

17న స్వతంత్ర దినంగా ప్రకటించాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

దామెర : తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఈనెల 17వ తేదీన స్వతంత్ర దినంగా అధికారికంగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఒగ్లాపూర్‌లో జిల్లా సమితి సభ్యుడు కొట్టెపాక రవి అధ్యక్షతన శనివారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని అనేక మంది కమ్యూనిస్టులు నేలకొరిగారని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి నేటి తరానికి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్, జిల్లా సహాయక కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నూనెకోమల చంద్రయ్య, కుమారస్వామి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

'అంబులెన్స్ ఏర్పాటు ఏమైంది'

శాయంపేట : మండల కేంద్రానికి అంబులెన్స్ కేటాయిస్తానని స్థానిక ఎమ్మెల్యే పదేపదే చెబుతూ వచ్చారే కాని ఇప్పటి వరకు కేటాయించలేదని దళిత సంఘం నాయకుడు మారేపల్లి సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలోని శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రోగులకు అత్యవసర చికిత్స అవసరమైనప్పుడు వరంగల్ ఎంజీఎంకు పంపించేందుకు అందుబాటులో అంబులెన్స్ లేకపోవడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రైవేటు అంబులెన్స్‌లను ఆశ్రయించాల్సి పరిస్థితి నెలకొందన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అంబుల్స్ అందుబాటులో లేకపోవడంతో ప్రాణ నష్టం జరిగిన సంఘటనలూ ఉన్నాయన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి 108 అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. లేని పక్షంలో ప్రజల తరుపున పోరాటం చేస్తామని అన్నారు.

ప్రజాపాలన దినోత్సవం అర్థరహితం

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు



ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నర్సంపేట : ఈనెల 17న ప్రజాపాలన దినోత్సవం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం అర్థరహితమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి చాకలి ఐలమ్మ విగ్రహం వరకు ఆ పార్టీ మండల సమితి ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శి గడ్డం యాకయ్య అధ్యక్షతన నిర్వహించిన సభలో శ్రీనివాస్‌రావు మాట్లాడారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన తెలంగాణ దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసపూరితంగా వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఈనెల 17న జిల్లా కేంద్రాల్లో జాతీయ జెండాలు ఎగరేయాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. అదే రోజు ప్రజాపాలన దినోత్సవంగా జరుపుతామనడం సరికాదన్నారు.

హిందీ దివస్

కాజీపేట రూరల్: కాజీపేట సెయింట్ గాబ్రియల్ ప్రాథమిక పాఠశాలలో శనివారం హిందీ దివస్‌ను నిర్వహించారు. ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంటోని పొలిశెట్టి, వైస్ ప్రిన్సిపాల్ స్లీవారెడ్డి హిందీ భాషా ప్రాధాన్యత, హిందీ నేర్చుకోవాల్సిన ఆవశ్యకతను వారు వివరించారు.